క్లుప్తంగా

విశాఖ ఉక్కుపై ఆంధ్రులకే హక్కు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంపై ఆంధ్రులకే హక్కు ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు పెదిరెడ్ల హరనాథ్, నీలకంఠం అన్నారు. కాదని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తే ఆంధ్రుల ఆత్మాభిమానం దెబ్బతింటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి వస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో 1222వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. వేలాది మంది తమ భూములను త్యాగం చేస్తే విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు అయిందని, వారి త్యాగాలను కాలరాసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో కె.అప్పారావు, పి.రాము, ఎ.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి రూ.30వేల ఆర్థిక సాయం



అప్పలనర్సమ్మకు నగదు అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఓ నిరుపేద వృద్ధురాలికి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయంలో పని చేస్తున్న బొడ్డు అప్పలనర్సమ్మ కాలు జారి పడటంతో ఆమె చేయి విరిగింది. నిరుపేద కావడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు అక్కిరెడ్డిపాలేనికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు అంగ శ్రీను, నంబారు రమణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ అధికారులకు సత్కారం



రిటైర్డ్ అధికారులను సత్కరిస్తున్న సీ, తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి పదవీ విరమణ చేసిన అధికారులను ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల పదవీ విరమణ చేసిన కోక్‌ఓవెన్స్ జీఎం బి.టి.నాయక్, హెచ్‌ఆర్ డీజీఎం వి.తిరుపతిరావులను సీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. సీ తరఫున వారికి మొమెంటోలు అందజేశారు. వారి సేవలను వక్తలు కొనియాడారు. సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ విధి నిర్వహణలో సహకరించిన అధికారులు, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీ నాయకులతో పాటు తెలంగాణ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



సహస్ర నామార్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరికి భక్తులు పోటెత్తారు. అప్పన్న ఆర్జిత సేవల్లో పాల్గొని తరించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా చేశారు. ఉభయదాతలకు స్వామి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను బేడామండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంచేయజేసి అష్టోత్తర శత నామావళి పూజ చేశారు.

లంకెలపాలెం..దాటాలంటే గగనం

- అనకాపల్లి వైపు రహదారిలో కిలోమీటర్ల మేర వాహనాలు
- సిగ్నల్ పాయింట్ దాటాలంటే 10–15 నిమిషాల నిరీక్షణ
- హడలిపోతున్న వాహనచోదకులు
- ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు వినతులు



సిగ్నల్ పాయింట్‌కు చాలా దూరంలో నిలిచిపోయిన వాహనాలు



అనకాపల్లి నుంచి గాజువాక వెళ్లే మార్గంలో సిగ్నల్ పాయింట్ వద్ద భారీగా నిలిచిన వాహనాలు

అగనంపూడి: లంకెలపాలెం జంక్షన్ అంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. అనకాపల్లి నుంచి గాజువాక వైపు వచ్చే మార్గంలో వాహనదారులు సిగ్నల్ పాయింట్ దాటాలంటే కనీసం రెండు సిగ్నల్స్ వరకు వేచి ఉండాల్సిందే. ప్రతీ రోజూ ఇదే పరిస్థితి ఉండడంతో వాహనచోదకులకు అగచాట్లు తప్పడం లేదు. ఏ సమయంలో అయినా కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఉండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కూడలిలో ఈ మార్గం వద్ద రహదారి ఇరుకుగా కుదించుకుపోయి ఉంది. దీంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఒక సారి సిగ్నల్ పూర్తి చేసుకుని, రెండో సారి సిగ్నల్ పూర్తయ్యేటప్పటికీ కూడా కూడలి నుంచి వెళ్తామనే నమ్మకం వాహనచోదకుల్లో లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

కనీసం 10–15 నిమిషాల నిరీక్షణ

ఒకసారి సిగ్నల్ క్లియర్ అవడానికి కనీసం ఆరు నిమిషాల సమయం పడుతుండడంతో, ఒక వాహనం కూడలి దాటాలంటే కనీసం రెండు విడతలు సిగ్నల్ పాయింట్ వద్ద వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో కనీసం పది నుంచి 15 నిమిషాల సమయం పడుతుండడంతో వాహనాలు కూడలి వద్ద భారీగా నిలిచిపోయే పరిస్థితి ఎదురవుతోంది.

ఫ్రీలెఫ్ట్‌తో సమస్య పరిష్కారం

గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలకు (ఫార్మాసిటీకి వెళ్లేందుకు వీలుగా) ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ తగ్గింది. నేరుగా అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలే వేచి ఉండాల్సి రావడంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా పోయింది. అదే అనకాపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలకు మాత్రం ఫ్రీ లెఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంతో ట్రాఫిక్ చక్రబంధంలో వాహనచోదకులు చిక్కుకుంటున్నారు. నగర పోలీస్ కమిషనర్, జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ మార్గంలో కూడా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతీ రోజూ నిరీక్షణే..

లంకెలపాలెం కూడలి వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రతీ రోజూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. మామూలు సమయాల్లో అరకిలోమీటరు మేర వాహనాలు బారులు ఉంటున్నాయి. ఎప్పుడూ ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడమే. అనుకున్న సమయానికి గమ్యానికి చేరగలమా అనే టెన్షన్ పెరిగిపోతోంది. ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆర్.నాగేశ్వరరావు, లంకెలపాలెం

ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి

అనకాపల్లి వైపు నుంచి లంకెలపాలెం కూడలి వద్దకు వచ్చేటప్పటికీ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. కూడలి వద్ద రహదారి ఇరుగ్గా ఉండటంతో వాహనాలు నిలిచిపోతున్నాయి. ఒక్కో సారి మరిడిమాంబ గుడి దాటి వాహనాలు బా రులు తీరుతున్నాయి.ఈ మార్గంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణం అంటే ఆలోచించాల్సి వస్తోంది. అనకాపల్లి వైపు నుంచి వచ్చే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయాలి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–డి.బ్రహ్మయ్య, గంగిరెడ్లకాలనీ

ఘనంగా ముగిసిన ఆలయ వార్షిక వేడుకలు

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీమాతకు హారతి ఇస్తున్న శ్రీధర స్వామీజీ



యాగంలో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి పంచాయతన దేవాలయం ద్వితీయ వార్షిక వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ ప్రతినిధులు మొగలపల్లి త్రిమూర్తులు, కొల్లా అప్పలరాజు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముక్కామల వాసవీమాత ఆత్మాహుతి స్థాన మహా పీఠాధీశుడు, విద్యా మహామంత్ర సిద్ధుడు శ్రీధర స్వామీజీ పర్యవేక్షణలో అమ్మవారిని రజతకవచంతో అలంకరించారు. పంచామృత పూర్వక సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, కుంకుమార్చనలు, మహా పూర్ణాహుతి, మండప ఉద్వాసన, మహా సంప్రోక్షణ, మహా చండిపూర్వక ఆరాధిత నవగ్రహ హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, వీఆర్‌కేఎస్ కుమార్, చిట్టూరి వెంకటేశ్వరరావు, బొండాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లా శ్రీనివాస్‌కు ఘన స్వాగతం



పల్లా శ్రీనివాస్‌ను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

గాజువాక: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులై, విశాఖ చేరుకున్న గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు ఆ కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. విశాఖ ఎయిర్ పోర్టులో ఆయనకు స్వాగతం పలికిన నాయకులు హైవేపై గజమాలతో సత్కరించారు. అనంతరం గాజువాక వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన బాధ్యతకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీవీవీ ఉపాధ్యాయుల దీక్షకు పీఈటీల మద్దతు



దీక్ష శిబిరం వద్ద మాట్లాడుతున్న అప్పలరాజు

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయుల దీక్షకు జిల్లా వ్యాయామ సంఘం మద్దతు తెలియజేసింది. విశాఖ విమల విద్యాలయం మూసివేతపై ఐదు రోజులుగా ఆ పాఠశాల ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. తమ డిమాండ్లపై పాఠశాల యాజమాన్యం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సత్వరం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విశాఖ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులను కలిసి సంఘీభావం తెలిపారు. 40 ఏళ్లుగా పాఠశాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉత్తీర్ణులై అనేక రంగాల్లో స్థిరపడ్డారన్నారు. అటువంటి చరిత్ర కలిగిన పాఠశాల ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, కార్యవర్గ సభ్యులు సతీష్, రవికుమార్, యూటీఎఫ్ ఇన్‌చార్జి మహిమా రావు, అచ్యుతాపురం ప్రధాన కార్యదర్శి సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ పండగకు సర్వం సిద్ధం

- అట్టహాసంగా ఏర్పాట్లు
- ఘనంగా తొలేళ్ల ఉత్సవం
- అమ్మవారి జోగి, ఘటాల ఊరేగింపు
- విశేషంగా గంటదీపాల ఉత్సవం



సిద్ధం చేసిన ఘటాలు



సతకం పట్టువద్ద పైడితల్లి అమ్మవారు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగకు విస్తృత ఏర్పాట్లు చేశారు. మంగళవారం అమ్మవారి పండగను పురస్కరించుకొని సింహాచల దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. షామియానాలు, టెంట్లు వేశారు. ఆలయ పరిసరాలతో పాటు అమ్మవారి సతకంపట్టు నుంచి పాత గోశాల వరకు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి జరిగే అమ్మవారి అనుపు మహోత్సవంలో పులివేషాలు, కాంతారా డ్యాన్స్, కేరళ డ్రమ్స్ ప్రదర్శనలను దేవస్థానం ఏర్పాటు చేసింది. గ్రామ సంప్రదాయం ప్రకారం గాంధీనగర్‌లో ఘటాలగుడిగా పేరుగాంచిన అమ్మవారి సతకం పట్టును అలంకరించారు. అనుపు మహోత్సవానికి పూజారి వంశీయుడు, ఉత్సవ కమిటీ చైర్మన్ లండ వెంకటరమణ ఆధ్వర్యంలో లండ కుటుంబీకులు ఘటాలను సిద్ధం చేశారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

సోమవారం రాత్రి తొలేళ్ల ఉత్సవం ఘనంగా జరిగింది. గాంధీనగర్‌లోని అమ్మవారి సతకం పట్టు నుంచి ఘటాలను పూజారి వంశస్తులైన లండ కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఊరేగించారు. సాయంత్రం గ్రామంలో అమ్మవారి జోగి ఊరేగించి.. రాత్రి పాత అడవివరంలో గంటదీపాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

గుడ్ క్లినికల్ ప్రాక్టీస్‌పై అవగాహన

అగనంపూడి: క్లినికల్ ప్రాక్టీస్‌కు ప్రాధాన్యత పెరుగుతోందని ఆంధ్రా మెడికల్ కళాశాల హెచ్‌ఓడీ డాక్టర్ శ్యామలరావు అన్నారు. దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాలలో గుడ్ క్లినికల్ ప్రాక్టీస్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ అంశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ ఫార్మా కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, సూర్యప్రకాశరావు, హేమసుందర్, వసుధ పాల్గొన్నారు.

క్లాప్ ఆటో లోడర్ల ఆందోళన



ఆందోళనకు దిగిన ఆటో లోడర్ కార్మికులు

గాజువాక: ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉండిపోయిన తమ జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాజువాక జోన్‌కు చెందిన క్లాప్ ఆటో లోడర్ కార్మికులు ఆందోళన చేపట్టారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం పక్కన గల యార్డులో ఆటోలను నిలిపివేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకపోతే కుటుంబాలు ఎలా నడుస్తాయో అధికారులు ఆలోచించాలన్నారు. కాగా, ఈ సందర్భంగా గాజువాక జోనల్ సహాయ ప్రజారోగ్యాధికారి కార్మికులతో మాట్లాడారు. రెండు, మూడు రోజుల్లో జీతాల సమస్యను పరిష్కరిస్తామని పేర్కొనడంతో కార్మికులు ఆందోళన విరమించి విధులకు హాజరయ్యారు.

మినీ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు వినతి



వినోద్‌కుమార్ గౌడ్‌తో వ్యాసశర్మ తదితరులు

అగనంపూడి: ఉత్తరాంధ్రలో నేషనల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ (నిడ్ కాఫ్) ద్వారా మినీ టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ (ఏబీఎఫ్) రాష్ట్ర కన్వీనర్ ధర్మాల వ్యాసశర్మ నిడ్‌కాఫ్ వైస్ చైర్మన్ వినోద్‌కుమార్ గౌడ్‌ను కోరారు. విశాఖ విచ్చేసిన ఆయన్ను కలిసిన వ్యాసశర్మ మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా మినీ టెక్స్‌టైల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్రం సుముఖంగా ఉందని, త్వరలో సానుకూల ప్రకటన వెలువడే అవకాశం ఉందని వినోద్‌కుమార్ గౌడ్ చెప్పారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీసం నాగేశ్వరరావు, బులుసు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



శ్రీనివాసుడికి అభిషేకం చేస్తున్న అర్చకుడు



తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో యాగాలు చేస్తున్న రుత్వికులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోతవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం వేకువజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం అర్చనలు చేశారు. తిరుమలేశునికి విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్యహోమం, ఉక్త హోమం, సర్వ దైవత్య హోమం, బలిహరణ, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. సూర్య ప్రభ వాహన సేవ, శ్రీవారి ఉత్సవ బింబాలకు అభిషేకం అనంతరం ప్రసాద వితరణ చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం అగ్నిధ్యానం, కుంభారాధన, నిత్య హోమం, స్వామి మూల మంత్ర హోమం, బలిహరణ నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారికి ముత్యాల పందిరి సేవ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. దివ్య క్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.



ముత్యాల పందిరి వాహనంపై దేవేరులతో శ్రీవారు

సద్గుణాల సందేశమే బక్రీద్



సందేశమిస్తున్న ఇమామ్ శాకీర్

- త్యాగం, ప్రేమ, సహనాలను చాటిచెప్పే పండగ
- ముస్లిం పెద్దల సందేశం
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు



ఇస్లాంపేటలో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



గాజువాకలో శాంతియాత్ర చేస్తున్న ముస్లింలు



అగనంపూడి మసీదులో వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు



ఇస్లాంపేటలోని మసీదు వద్ద ముస్లిం మత పెద్దలు

గాజువాక: త్యాగం, ప్రేమ, సహనం వంటి సద్గుణాల సందేశమే బక్రీద్ అని ముస్లిం మతపెద్దలు పేర్కొన్నారు. దైవ ప్రవక్త మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈద్–ఉల్–జుహా (బక్రీద్)ను గాజువాక ప్రాంత ముస్లింలు సోమవారం ఘనంగా నిర్వహించారు. గాజువాకలోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంతకుముందు అజీమాబాద్‌లోని సున్నీ జామా మసీదు నుంచి కణితి రోడ్, బీసీ రోడ్ మీదుగా ఈద్గా మైదానం వరకు శాంతి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నీ జామా మసీద్ ఇమామ్ శాకీర్ సారథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గాజువాకలోని వివిధ మసీదులలోనూ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకొన్నారు. ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రార్థనలలో ముస్లింలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో సున్నీ జామా మసీదు, మదీనా మసీదు, గౌసియా మసీదు పెద్దలు మహ్మద్ రఫీ, మదీనావలి, షౌకత్ అలీ, ఇషాక్, జబ్బర్, అన్సర్, రజీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి మసీదులో..

అగనంపూడి: బక్రీద్ పండగ ముస్లిం సోదరుల ఇళ్లల్లో సంతోషాన్ని నింపాలని సీడబ్ల్యూసీ మాజీ కార్యదర్శి వంకర రాము ఆకాంక్షించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని అగనంపూడిలోని ఈ అబూబకర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అగనంపూడి మసీదులో పండగ సందేశం ఇచ్చిన అనంతరం ముస్లింలకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, మసీద్ కమిటీ అధ్యక్షుడు భాషా భాయ్, అబ్దుల్ రహమాన్, ఎండీ పీర్‌షా, షేక్ షిలారీ, హుస్సేన్ కెజె నాయుడు పాల్గొన్నారు.

ఇస్లాంపేట మసీదులో..

పెదగంట్యాడ: బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. 77వ వార్డు ఇస్లాంపేట, పెదపాలెం, చినపాలెం తదితర ప్రాంతాల్లోని ముస్లిం పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బక్రీద్ ప్రాధాన్యాన్ని, ఖుర్బానీ సంప్రదాయాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ దైవం కోసం పవిత్రమైన త్యాగం చేయడానికి సిద్ధం కావాలనే సందేశాన్నిచ్చారు. పేదలతో, బంధువులతో ఆహారాన్ని పంచుకునే ఈ పండగ మనకున్నదాంట్లో నలుగురికీ సాయం చేయాలనే సందేశాన్ని ఇస్తుందన్నారు. అనంతరం మదర్సాలోని పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మస్తాన్, ఆలీ మాస్టార్, హుస్సేన్ ఆలీ సాసీర్, షాకీర్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో..

ఉక్కునగరం: బక్రీద్ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ సెక్టార్–6లోని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు మత గురువుల ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక నమాజ్‌లో పాల్గొన్నారు. ఒకరికొకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధువులకు, స్నేహితులకు మాంసం, స్వీట్లు పంపిణీ చేశారు. చుట్టుపక్కల ఉన్న పేద ముస్లింల ఇంటికి వెళ్లి వారికి కానుకలు అందజేశారు. మసీదు కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మళ్లీ పని చేయని కోచ్ ఇండికేటర్లు

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు



దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై కోచ్ ఇండికేటర్లు తరచూ మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గత రెండు రోజుల నుంచి కోచ్ ఇండికేటర్లు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీలతో, పిల్లలతో వారి రిజర్వేషన్ బోగీల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. తరచూ ఈ సమస్య తలెత్తడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ మరమ్మతులకు కావల్సిన సామగ్రి ఢిల్లీ నుంచి రావాల్సి ఉందని, మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని చెబుతున్నారు.